నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 21 మే 2023

సమస్యలుంటే చెప్పండి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రం లోని గ్రామపంచాయతీలో శనివారం సర్పంచ్ అంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విఎల్‌హెచ్‌పి జ్యోతి మాట్లాడుతూ దోమకొండలో ఒక్కొక్క సబ్ సెంటర్ 50 వేల నిధులు మంజూరు అవుతాయని అట్టి నిధులను సమాజానికి, ప్రజలకు అవసరమయ్యే విధంగా ఉపయోగించుకునేందుకు ప్రతి శనివారం సమావేశం ఏర్పాటు చేసుకుంటున్నట్టు తెలిపారు. సబ్ సెంటర్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, సిడిసి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ ఐరన్ నరసయ్య ,ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వికలాంగుల సర్వే



నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల సర్వే నిర్వహించినట్టు మండల విద్యాధికారి రామస్వామి తెలిపారు. మండలంలోని బోనాల్, నల్లమడుగు, లింగంపల్లి, రాంపూర్ తండాలో దివ్యాంగుల సర్వే నిర్వహించి వివరాలు సేకరించారు. ఈ సర్వే ఈనెల 25 వరకు కొనసాగుతుందని అన్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు గిరిజన తండాలో సైతం దివ్యాంగులు ఉన్నట్లయితే వెంటనే సర్వేలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నామని, సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సర్వేలో సమగ్ర శిక్ష సభ్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో ప్రమాదం

- నలుగురి కార్మికులకు తీవ్ర గాయాలు
- ఎమర్జెన్సీ హెల్త్ సెంటర్ లేక సకాలంలో అందని వైద్యం



గాయపడ్డ కార్మికుడు

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో కార్మికులకు రక్షణ లేకుండా పోయింది. ఫ్యాక్టరీ కార్మికులు పనిచేసే వద్ద కనీసం ఎమర్జెన్సీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడంతో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణ వైద్య సాయం అందడం లేదు. తాజాగా శనివారం ఫ్యాక్టరీలో రెండు వేర్వేరు ఘటనలో ఇద్దరి కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన దొండడి కుమార్, ఇదే గ్రామం లో నివాసం ఉంటున్నా రమేష్‌లకు వాటర్ ఫ్రెషింగ్ వద్ద గాయాలు కాగా,స దాశివనగర్ లో నివాసం ఉంటున్న శంకర్ తో పాటు అంబర్ సింగ్, దేవయ్యలకు బైలర్ వద్ద బికాస్ మిస్ ఫైర్ కావడంతో భారీ ఎత్తున మంటలు వ్యాపించి గాయల పాలయ్యారు. వీరిని ఆసుపత్రికి తరలించిగా ఇద్దరి పరిస్థితి సీరియస్ ఉంది. గతంలో గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో కార్మికుడు గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ వల్లే మరణిస్తే ఎమర్జెన్సీ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలను ఫ్యాక్టరీ తుంగలో తొక్కింది. ఫ్యాక్టరీలో ఎమర్జెన్సీ హెల్త్ సెంటర్‌ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

రైతన్నల రాస్తారోకో



రాస్తారోకో చేపట్టిన రైతులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని మెదక్ ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై శివనగర్ గేట్ వద్ద రైతులు శనివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సకాలంలో లారీలు రావటం లేదని వచ్చినా లారీలు సంచీకి రూపాయి ఇస్తేనే లోడ్ చేసుకుంటామని ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వర్షాలు పడి ధాన్యం పాడవటంతో రైస్ మిల్లు వాళ్ళు తరుగు పేరుతో ఇబ్బంది గురి చేస్తుంటే ఇప్పుడు లారీల వాళ్ళు ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. అయినా సొసైటీ వాళ్ల పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో చేపట్టడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

నాయకుల బస్తీబాట

- ఎన్నికల యేడాదితో అలర్ట్
- అధికార పార్టీ ముందంజ
- కర్నాటక ఫలితాలతో హస్తంలో జోష్
- మందిర్, మస్జీద్‌పైనే బీజేపీ ఆశలు
- వామపక్షాల ఐక్యతారాగం



వీక్లి రౌండప్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల నామ సంవత్సరం కావడంతో... అన్ని పార్టీలు బస్తీబాట పడుతున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. అధికార పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు, అభివృద్ధి శంకుస్థాపనాలతో ముందు వరుసలో ఉంది. ఇక వరుస ఓటములతో నిస్తేజంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి కర్నాటక ఫలితాలు పెద్ద ఊరట కల్పించాయి. బీజేపీ అంతర్గత కలహాలతో సతమతమవుతోంది. మందిర్, మస్జీద్ అంశంపైనే ఆ పార్టీ భరోసాతో ఉంది. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి ఫలితం పొందేందుకు యత్నిస్తోంది. అలాగే జిల్లాలో అధికంగా ఉన్న బీసీ ఓట్లను ప్రసన్నం చేసుకునేందుకు బీసీలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఇక వామపక్ష పార్టీలు ఇకపై ఐక్యంగా ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించడం శుభపరిణామం.

ఈ యేడాది చివరి నాటికి రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయన్న ఊహాగానాల నేపథ్యంలో.. ఇప్పటి నుంచే అన్ని పార్టీలు ఎన్నికలకు సమాయాత్త మవుతున్నాయి. ఈ విషయంలో అధికార బీఆర్ఎస్ పార్టీ అన్నింటికంటే ముందుగా ఉంది. ఆ పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. అందులో భాగంగా ముందుగా పార్టీ కేడర్‌ను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని బుజ్జగించేందుకు, ఎన్నికలకు సమయాత్తం చేసేందుకు 'ఆత్మీయ సమ్మేళనాలు' నిర్వహించింది. కేడర్‌ను మానసికంగా సిద్ధం చేసిన తరువాత ప్రజల్లోకి వెళ్తోంది. ఇందుకు ఏ కార్యక్రమాలను నాయకులు విడవడం లేదు. అందులో భాగంగా యువతకు చేరువయ్యేందుకు సీఎం కప్ పేరిట యువతను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేసింది. అలాగే ప్రస్తుత పెండ్లిళ్ల సీజన్ కావడంతో స్వయంగా మంత్రి కూడా వివాహాలకు హాజరై అందరికీ దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమా లను సైతం రాజకీయ వేదికలుగా మార్చుకుని విపక్షాలపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

కాంగ్రెస్‌లో జోష్..

జిల్లాలో, రాష్ట్రంలో వరుస ఓటములతో నిస్తేజంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కర్నాటక ఫలితాలు పెద్ద ఊపునిచ్చాయి. పార్టీ కేడర్‌కు కొండంత బలన్నిచ్చినట్టయ్యింది. కర్నాటక ఫలితాలను తెలంగాణలోనూ పునరావృతం చేస్తామని టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఇది వరకే ప్రకటించారు. అందులో భాగంగా రాష్ట్రంలో, జిల్లాలో పార్టీ నుంచి వెళ్లిపోయిన సీనియర్ నాయకులను మళ్లీ తిరిగి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ఎన్నికల్లో ఎవరిని పోటీకి దించాలనే అంశంపై కసరత్తు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉండటం.. కాంగ్రెస్ పార్టీ లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉంటుందనే ప్రచారంతో దూరమైన మిత్రులను సైతం మళ్లీ దగ్గర చేసుకునే ప్రయత్నం చేస్తోంది. ఎన్నికల నాటికి పూర్తి బలం సమీకరించుకుని అధికారంలోకి రావాలని ప్రయత్నం చేస్తోంది.

అంతర్గత కలహాలతో బీజేపీ..

బీజేపీలో నెలకొన్న అంతర్గత కలహాలు ఆ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. ముఖ్యంగా నిజామాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీకి యెండల కూడా సిద్ధమవుతుండటంతో టిక్కెట్టు ఎవరికి కేటాయిస్తారన్నది పార్టీ నేతల్లో ఆందోళనగా మారింది. ఒకవేళ ధన్‌పాల్‌కు కేటాయిస్తే.. యెండల వర్గం సహాయనిరాకరణ చేస్తుంది. ఇక గత ఎన్నికల్లో ధన్‌పాల్‌కు టిక్కెట్టు కేటాయించకపోతే ఏకంగా పార్టీ జిల్లా కార్యాలయాన్ని ధన్‌పాల్ అనుచరులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఇక ఆర్మూర్‌లో రోజుకొక పేరు ముందుకు వినిపిస్తోంది. వినయ్‌రెడ్డికి కాకుండా మరొకరికి టిక్కెట్టు కేటాయిస్తే.. అక్కడ కూడా అర్బన్ పరిణామాలే పునరావృతమవుతాయి. బాల్కొండలో ఎంపీ అరవింద్ ఒకరి పేరు ముందుకు తీసుకొస్తే.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మరొకరి పేరును ప్రతిపాదిస్తున్నారు. ఈ విధంగా అన్ని ప్రాంతాల్లో పార్టీ రెండు నుంచి మూడు గ్రూపులుగా చీలిపోయింది. అయితే ప్రజల దృష్టి మరల్చేందుకు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న మందిర్, మస్జీద్ విధానం ముందుకు తీసుకొచ్చే ప్రమాదముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

వామపక్షాల ఐక్యతారాగం..

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష పార్టీలు కలిసి ఐక్యంగా పోటీ చేయాలని నిర్ణయించడం రాష్ట్రంలో ఓ శుభపరిణామం. గతంలో పలుమార్లు వామపక్ష ప్రజాతంత్ర కూటమిని బలోపేతం చేయాలని నిర్ణయించినప్పటికీ.. పలుకారణాల వల్ల అది సాధ్యపడలేదు. కానీ ఇటీవల సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర అగ్రనాయకులు ఐక్య సమావేశం ఏర్పాటు చేయడం, కలిసి పోటీ చేయాలని నిర్ణయించడం జరిగింది. దీనివల్ల జిల్లాలోనూ వామపక్ష పార్టీల బలం పెరిగే అవకాశముంది. ముఖ్యంగా అంగన్‌వాడీ, ఆశ, మున్సిపల్, పంచాయతీ, బీడీ, ఆటో యూనియర్, హమాలీ తదితర ప్రజా సంఘాల్లో ఈ రెండు పార్టీల బలం అధికంగా ఉంది. ఈ కేడర్‌ను ఎన్నికల సమయానికి సమయాత్తం చేసి వామపక్ష ఐక్య కూటమిని బలోపేతం చేసేలా ప్రయత్నాలు చేస్తే.. జిల్లాలో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ఆస్కారముంది.

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తనిఖీలు

- నవతెలంగాణ కథనం నేపథ్యంలో అధికారుల చర్యలు



తనిఖీలు చేపడుతున్న అధికారులు, పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలోని నకిలీ విత్తనాలు లేకుండా చేసే దిశగా శనివారం వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ విత్తన విక్రేత కేంద్రాలపై తనిఖీలు నిర్వహించామని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ వానాకాలంలో సుమారు 5 లక్షల ఎకరాల పైచిలుకు పంట సాగవుతుందని అంచనా ఉందని అందులో సుమారు 4లక్షల ఎకరాల పైచిలుకు వరి పంట, సుమారు 60 వేల ఎకరాల్లో సోయా పంట సాగవుతుందని అన్నారు. వరి, సోయా విత్తనాలు రైతులకు అధీకృత డీలర్ల ద్వారా అందించనున్నట్టు తెలిపారు. జిల్లాలో సుమారు 578 విత్తన విక్రేత డీలర్లు, 75 విత్తన తయారీ కేంద్రాలు ఉన్నాయి అని అన్నారు. ఈ వానాకాలం పంటలకు ముందుగానే విత్తన కేంద్రాలపై తనిఖీలు నిర్వహించి, అనుమతి లేని విత్తనాలు నకలీలు మొదలైన వాటిపై ముందస్తు తనిఖీలు చేసి ఈ నకిలీల నుండి బెడద లేకుండా చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ లు సంయుక్త ఆధ్వర్యంలో 186 విత్తన డీలర్ల కేంద్రాలలో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ తనిఖీలు, ఈ వానాకాలం సీజను మొత్తంలో జరుగుతుందని, రైతులకు బాసటగా ఉంటూ కల్తీ విత్తన రహిత జిల్లాగా నిజామాబాద్ జిల్లాను ఉంచనున్నట్టు తెలిపారు. జిల్లా విత్తన టాస్క్ ఫోర్స్ టీమ్ గా ఒక ఎసిపి స్థాయి పోలీసు అధికారి, విత్తన ధృవీకరణ సంస్థ అధికారి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్, డైరెక్టర్ సభ్యులుగా జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు.

దొడ్డు వడ్లకు గడ్డుకాలం

- రైస్ మిల్లర్ల నిలువు దోపిడీ
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- క్వింటాలుకి ఆరు కిలోలకు పైగా తరుగు
- లబోదిబోమంటున్న రైతులు
- సొసైటీకి తాళం వేసి అర్ధనగ్నంగా బైఠాయింపు



అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు

నవతెలంగాణ-నవీపేట్

దొడ్డు రకం వరి ధాన్యం పండించిన రైతులకు ఈ సీజన్లో రైస్ మిల్లర్ల దోపిడితో గడ్డుకాలంగా మారింది. ప్రభుత్వం దొడ్డు రకం ధాన్యానికి ఏ-గ్రేడ్ చెల్లిస్తున్నప్పటికీ రైస్ మిల్లర్లు మాత్రం దొడ్డు రకం ధాన్యాన్ని తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. వర్షాకాలం సీజన్‌లో తమ రైస్ మిల్లులకు దొడ్డు రకం పంపకుండా ఎండాకాలం దొడ్డు వడ్లను ఎందుకు పంపిస్తారని సొసైటీ సిబ్బంది, రైస్ మిల్లర్ల మధ్య భేదాభిప్రాయాలతో దొడ్డు రకం వడ్లు పండించిన రైతులకు ఇబ్బందులు అంతా ఇంతా కాదు. కోత కోసిన వారాల తరబడి కాంట కోసం వేచి చూడడం కాంటా చేసిన వడ్ల కోసం లారీలు రాక వారం రోజుల పాటు రోడ్లపైనే ఉండడం, అతి కష్టం మీద లారీ వచ్చిన రైస్ మిల్లులలో ధాన్యం దించుకునేందుకు నాలుగు, ఐదు రోజులు పట్టడంతో వడ్లు పూర్తిగా ఎండిపోయి మ్యాచర్ తగ్గి తక్కువ బరువు రావడం, తరుగు పేరుతో రైస్ మిల్లర్లు మరింత భారం వేయడంతో క్వింటాలుకు ఆరు కిలోలకు పైగా నష్టపోతున్నారు.

సంచికి మూడు కిలోల తరుగు

మండల కేంద్రానికి చెందిన నాగరాజు, సంతోష్, నర్సయ్య, భోజమ్మలు 40 కిలోల సంచికి మూడు కిలోల తరుగు ఎలా తీసుకుంటారని నవీపేట్ సొసైటీ గేటుకి తాళం వేసి బైఠాయించారు. రైతు నాగరాజు అర్ధ నగ్నంగా మండుటెండలో శనివారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి క్వింటాలుకు రెండున్నర కిలోలు మాత్రమే తరుగు తీసేలా రైస్ మిల్లర్లకు ఆదేశించాలని తహసిల్దార్ వీర్ సింగ్ ను ఫోన్లో చెప్పారని కానీ తాము క్వింటాలుకు మూడు కిలోలు ఒప్పుకున్నామని తమకు తెలియకుండానే లారీలో 611 సంచులు పంపగా 568 మాత్రమే నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని సొసైటీ ఎదుటే బైఠాయించారు. సొసైటీ చైర్మన్ న్యాలకంటి అబ్బన్న వచ్చి డ్రైవర్ దగ్గర ఉన్న షీట్ తప్పుగా పంపవచ్చని సొసైటీకి ఎటువంటి ట్రక్ షీట్ రాలేదని ఏదైనా సమస్య ఉంటే ఎమ్మార్వోతో కలిసి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తమ సమస్య పరిష్కారం చేయకపోతే మళ్లీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు వెనుతిరిగారు.

61 బస్తాలు తరుగు తీసిండ్రు

కౌలు రైతు నేకల సుదర్శన్, తడగాం

దొడ్డు రకం వడ్లు నలుగురు రైతులు కలిసి 513 బస్తాలు పంపగా వెయిట్ లాస్ పేరుతో 21 బస్తాలు తరుగు పేరుతో 40 బస్తాలు మొత్తం 61 బస్తాలు తరుగుతీసి 553 బస్తాలకు మాత్రమే బిల్లు చేసింద్రు. అకాల వర్షాలతో నష్టపోయిన మాకు రైస్ మిల్లర్లు ఇలా దోచుకోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

కాంటా చేసి వారం రోజులు అవుతున్న లారీ రాలేదు

రెడ్డి శివ కుమారి, మహిళ రైతు, కమలాపూర్

దొడ్డు రకం వడ్లు కాంటా చేసి వారం రోజులు అవుతున్న లారీ రావడం లేదు. 600 బస్తాలు కాంటా చేసి లారీ కోసం ఎదురు చూస్తున్నాను. వారం రోజులుగా మండుటెండలో బస్తాలు మ్యాచర్ తగ్గి మిల్లర్ల వద్ద ఎటువంటి ఇబ్బంది కలుగుతుందోనని ముందుగానే ఆందోళన చెందుతున్నాను. అధికారులు స్పందించి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలి.

నీట మునిగి ఇంటర్ విద్యార్థి మృతి

- సరదాగా స్నేహితులతో ఈతకు వెళ్లి..



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు



రేవంత్(ఫైల్)

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మిత్రులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన ఇంటర్ విద్యార్థి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని చౌట్ పల్లి లో శనివారం జరిగింది. కమ్మర్ పల్లి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన మేరకు వివరాల ప్రకారం.. మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం రేవంత్(18) మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్ద ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్న సమయంలో తన స్నేహితులతో కలిసి అమీర్ నగర్ గ్రామ శివారులో గల వ్యవసాయ భూమిలో ఉన్న బావిలోకి ఈతకు వెళ్ళాడు. ఈత కొట్టడానికి బావిలోకి దిగగా బావి లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. స్నేహితులు కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో నిస్సహాయులుగా చూస్తూ ఉండిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి తండ్రి ధర్మేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ధర్మేందర్‌కు రేవంత్ ఒకే ఒక కుమారుడు. చేతికి వచ్చిన కుమారుడు ఈత కోసం వెళ్లి బావిలో మునిగి చనిపోవడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. విద్యార్థి మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

కొత్త రోడ్డుకు ప్యాచ్‌లు

- నాచుపల్లి బీటీ రోడ్డు పనుల్లో హడావుడి
- అధికారుల పర్యవేక్షణ లేమితో నాణ్యత కరువు
- రెండు నెలలకే గుంతలు





రెండు నెలల క్రితం వేసిన రోడ్డుపై పగళ్లు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలం నెమ్లి సాయిబాబా మందిరం నుండి నాచుపల్లి, వీరాపూర్ వరకు వెళ్లే రోడ్డు వరకు గుంతలతో కూడిన రోడ్డులో ప్రయాణిస్తూ నిత్యం వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో వాహనదారులకు పాదాచార్లకు ప్రధాన సమస్యను అధిగమించడానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నాలుగు కిలోమీటర్ల దూరం గల రోడ్డును కోటి 16 లక్షలతో బీటీ రోడ్డు మంజూరు చేశారు. రోడ్డు భవనాల శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంతో బీటీ రోడ్డు పనులు నాసిరకంగా చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బీటీ రోడ్డు నిర్మాణ పనులలో అధికారుల పర్యవేక్షణ కరువవడంతో నాణ్యత లోపంతో బీటీ రోడ్డు నిర్మాణం పనులు హడావుడిగా సాగాయని, తూతూ మంత్రంగా కాంట్రాక్టర్ పూర్తి చేసి చేతులు దులుపుకున్నారని, గతుకుల రోడ్డుతో ఇబ్బంది పడిన వానదారులు, అయా గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కోటి 16 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడంతో కొత్త రోడ్డు వచ్చిందని స్థానికులు మురిసిపోయారని, కానీ రోడ్డుపై వాహనాల రాకతో రెండు నెలలకే అక్కడక్కడ తారు లేచిపోయి మెటల్ రోడ్డు దర్శనమిస్తుందని, వేసిన నెలలకే ఇలా తారు లేచిపోవడంతో ఇదేం రోడ్డు అని స్థానికులు ముక్కున వేలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గుంతలు ఏర్పడిన రోడ్డుపై ప్రయాణించి ఒళ్ళు హూనం చేసుకున్న వాహనదారులు ఇకనైనా కొత్త రోడ్డుపై ప్రయాణిస్తామనుకున్న వారి సంతోషం మూడున్నరాల ముచ్చటగా మారింది. లక్షలు వెచ్చించి వేసిన రోడ్డు పెచ్చులుగా లేస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మించటంతో నెలలకే రోడ్డుకు ప్యాచ్ లు ఏర్పడుతున్నాయని ప్రజలు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. నాణ్యతతో పనులు చేపట్టాలని స్పీకర్ సూచించినప్పటికీ కాంట్రాక్టర్ తమ ఇష్టానుసారంగా బీటీ రోడ్డు నిర్మించాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యత లోపం కనిపిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

పర్యవేక్షణలోనే రోడ్డు వేశాం

డిప్యూటీ ఇంజనీర్, మోహన్. బాన్సువాడ

సాయిబాబా మందిరం నుంచి వీరాపూర్ బ్రిడ్జి వరకు కోటి 16 లక్షలు మంజూరు కావడంతో 4 కిలోమీటర్ల పొడవు వేసిన బీటీ రోడ్డుకు రోడ్డు భవనాల శాఖ అధికారుల పర్యవేక్షణలోనే తారు రోడ్డు వేయించాం. కొత్త రోడ్డుపై వరి కోత మిషన్లు, ట్రాక్టర్లు తిరగడం వల్లనే రోడ్డుపై అక్కడక్కడ చిన్న గుంతలు పడ్డాయి. వెంటనే వాటిని మరమ్మతులు చేస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మృతిచెందిన విజయ

నవతెలంగాణ-దోమకొండ

అనుమానస్పద స్థితిలో మహిళా మృతి చెందిన ఘటన దోమకొండ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం చారి తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండల కేంద్రానికి చెందిన లోలప్ విజయ (48) బీడీ వర్కర్ గా జీవనం కొనసాగించేది. మృతురాలు కు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురు రమ్యను ఇల్లరికం పెట్టు కొని అల్లుడు పరుశరామ్ లు ఇంటి వద్ద నే ఉంటున్నాడు. అల్లుడు పరుశరామ్ లు అప్పులు చేస్తు, మద్యం సేవించి ఇంట్లో అత్తమ్మతో గొడవ చేసేవాడని తెలిపారు. మృతురాలు లోలపు విజయ ఇంట్లో ఉన్న దులానికి శుక్రవారం రాత్రి అనుమానస్పద స్థితిలో ఉరివేసుకొని మృతి చెందిదని ఏఎసై సుబ్రహ్మణ్యం చారి తెలిపారు. మృతురాలు కూతురు రమ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

సావెల్‌లో పారిశుధ్య పనులు

నవతెలంగాణ-మెండోర



సీజనల్ వ్యాధులు విష జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలలో భాగంగా సావెల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ నేల.లావణ్య లింగన్న ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు శనివారం సైతం కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రామంలో వీధి వీధిలో ఉన్న డ్రైనేజీ పూడికలు తీసి అంటు వ్యాధులు సోకకుండా తగిన చర్యలు చేపట్టారు. గ్రామంలో పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నేల్ల.పోశెట్టి , వార్డు సభ్యులు , పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ముచ్కూర్‌లో మూడు ఇళ్లలో చోరీ

- 10 తులాల బంగారం, 76 తులాల వెండి చోరీ

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని ముచ్కూర్ గ్రామంలో మూడు ఇళ్లలో దొంగతనం జరిగినట్లు ఎస్సై రాజ్‌భరత్‌రెడ్డి తెలిపారు. ముచ్కూర్‌కు చెందిన గీతేశ్వర్‌గౌడ్, శనిగరం నవీన్‌రెడ్డి, పత్రి సుదర్శన్ ఇళ్లకు వేసిన తాళలను పగుటగొట్టిన ఇళ్లలోకి చొరబడిన గుర్తు తెలియని దొంగలు 10 తులాల బంగారం, 76 తులాల వెండి, నగదును ఎత్తుకెళ్లినట్లు బాదితులు ఇచ్చిన పిర్యాదు చేశారు. ఈ మేరకు ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో వేలి ముద్రలు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

నాణ్యమైన విత్తనాలనే అమ్మాలి

- లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు
- విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు
- నవతెలంగాణ కథనానికి స్పందన

నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, నాసిరకమైనవి అమ్మితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లాలోని పలుమండలాల్లో ఎరువులు, విత్తనాలు దుకాణాలను శనివారం తనిఖీచేశారు. విత్తనాల నిల్వలను రికార్డులను పరిశీలించారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ-విలేకరులు

వర్ని: రైతులకు నాణ్యమైన విత్తనాలను లైసెన్స్ కలిగిన కంపెనీలు మాత్రమే అమ్మాలని సీఐ జాన్ రెడ్డి తెలిపారు. మండలంలోని సీడ్ కంపెనీలు ఫర్టిలైజర్ దుకాణాలలో విత్తనాలను తనిఖీ చేశారు. నాణ్యత లేని విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణాలను సీజ్ చేస్తామని యజమానులకు హెచ్చరించారు. పలు సీడ్ కంపెనీ లు, ఫర్టిలైజర్ల దుకాణాల లైసెన్సులు, విత్తనాలను మండల వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్ రెడ్డి పరిశీలించారు. వారితో పాటు ఎస్ఐ అనిల్ రెడ్డి ఉన్నారు.

సిరికొండ: మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను టాస్క్ ఫోర్స్ బందం, పోలీస్, వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. ధర్పల్లి సిఐ సైదా నాయక్, సిరికొండ ఎస్ఐ నరసింహులు, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, మండలంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. డీలర్లు ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని తెలిపారు. పంట కాలం పూర్తయ్యే వరకు రసీదును జాగ్రత్తగా తమవద్ద ఉంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు. గ్రామాలలో లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మడానికి వస్తే, వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కమ్మర్‌పల్లి : మండల పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల లైసెన్సులను, నిల్వ ఉన్న స్టాక్ రిజిస్టర్లను అధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వ అనుమతి వున్న కంపెనీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు మాత్రమే కొనుగోలు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు కూడా విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో ఎస్ఐ రాజశేఖర్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రవి, పద్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రాలతోపాటు గ్రామాలలో గల విత్తన విక్రయ ధారుల దుకాణాలను టాస్క్ ఫోర్స్ బందం, పోలీస్, వ్యవసాయ అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో నిజామాబాద్ రూరల్ ఎడిఎ ప్రదీప్ కుమార్, డిచ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కష్ణ, ఎస్ఐ కచ్చకాయల గణేష్, నరేష్, మండల వ్యవసాయ అధికారులు రాంబాబు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లైసెన్స్, సర్టిఫైడ్ విత్తనాలను విత్తన ద్రవీకరణ విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాలు కొన్న రసీదును పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని అధికారులు కోరారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని విత్తన దుకాణాలను పోలీసు, వ్యవసాయ అధికారులు, జక్రాన్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్ మండల వ్యవసాయ అధికారిని దేవిక మండలంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

ఏర్గట్ల: మండలంలోని విత్తన దుకాణాల్లో ఎస్సై రాజు, ఏఓ అబ్దుల్ మాలిక్ కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మడానికి ఎవరైనా వస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎఎస్సై ఇస్మాయిల్, కానిస్టేబుళ్ళు శ్రీధర్, తిరుమలేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆర్మూర్ : సహాయ వ్యవసాయ సంచాలకులు విజయలక్ష్మి పట్టణంలోని విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు, వ్యవసాయ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.



వేల్పూర్‌లో



వర్నిలో

మెండోర: మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ తో కలిసి తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు విక్రాయిస్తే పిడి యాక్ట్, విత్తన చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

వేల్పూర్: మండలంలోని విత్తన పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగ తనిఖీ చేశారు. విత్తనాలు తీసుకునే ముందు విత్తనాల నాణ్యత ప్రమాణాలు సీడ్ బాగ్ పైన పూర్తిగా పరిశీలించి తీసుకోవాలని సూచించారు.

నందిపేట్ : మండల కేంద్రంలో పలు సీడ్స్, పర్టిలైజర్ దుకాణాలనుమండల వ్యవసాయాధికారిని జోస్నా భవాని, ఏఎస్ఐ అరిపుద్దీన్ కలిసి తనిఖీ చేశారు. దుకాణదారులు తప్పనిసరిగా బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్, ఇతర రికార్డులను తప్పనిసరి సమకూర్చుకోవాలన్నారు.

మాక్లూర్ : మండలంలోని పురుగు మందుల షాప్, విత్తనాల షాపులను అగ్రికల్చర్ డిపార్ట్మెంట్, పోలీస్ డిపార్ట్మెంట్ కలసి పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పద్మ, ఎస్సై యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

కోటగిరి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలలో పెస్టిసైడ్స్ షాపులపై కోటగిరి, రుద్రూర్ ఎస్ఐలు మచ్చేందర్ రెడ్డి, రవీందర్, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తనిఖీచేశారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు లావణ్య ఎస్సై ముత్యంరాజ్ సంయుక్తంగా తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించేవారి వారి వివరాలను పోలీసులకు అందిస్తే వారి పేర్లను గోపంగా ఉంచుతామని అన్నారు. వీరి వెంట శ్రీలత, మోహన్, రంజిత్ పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో

ముప్కాల్: మండలంలోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్, ఎస్ఐ భాస్కర చారీ తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజ్ కుమార్, ఎస్ఐ భాస్కర చారీ, వ్యవసాయ శాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

ధర్పల్లి : మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాల విక్రయాలు అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ బందంతోపాటు పోలీసులతో మండలంలోని అన్ని ఫర్టిలైజర్,పెప్సిసైడ్ మందుల షాపుల్లో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్పల్లి ఎస్ఐ వంశీ కష్ణ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

భీంగల్: పట్టణకేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఏడిఏ మల్లయ్య ఎస్సై రాజ్‌భరత్‌రెడ్డితో కలిసి తనీఖీలు చేశారు. దుకాణాలలో ధరల పట్టికలు రైతులకు కనిపించే విధంగా ఉంచాలని యజమానులకు సూచించారు ఏఈఓ లక్‌పతి ఉన్నారు



నందిపేట్‌లో..



ఏర్గట్లలో



జక్రాన్‌పల్లిలో..



కమ్మర్‌పల్లిలో..

మోడల్‌లో ఇంటర్ ప్రవేశాలు పారంభం

నవతెలంగాణ-వర్ని

రుద్రూరు మండలంలోని అంబం గ్రామంలోగల మోడల్ కళాశాలలో ఈ నెల 25 నుంచి ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసుకొవాలని పిన్సిపాల్ నరేందర్ ఒక ప్రకటలొ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసి, సీఈసిలో 40 సీట్లు కలవని పేర్కొన్నారు.

వైకుంఠధామం పనులు పరిశీలన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అర్సపల్లి, దుబ్బ వైకుంఠ ధామం పనులని శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో అదికారులు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

బైకుపై నుండి పడి యువకుడు మృతి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



పరిశీలిస్తున్న పోలీసులు

కాలురు గ్రామానికి చెందిని యువకుడు బైక్‌పైనుండి పడి మృతిచెందాడు. సరికెల గోపికృష్ణ (30) ఈనెల 19న రాత్రి 11గంటలకు తన బైక్ పై నిజామాబాద్ వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తున్నాడు. కాలూర్ శివారులో బైకు అదుపుతప్పి కింద పడిపోగా తలకు బలమైన దెబ్బలు తగలగా అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై భార్య సరికల గౌతమి ఫిర్యాదు మేరకు నిజామాబాద్ రూరల్ ఎస్ఐ లింబాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-ఆర్మూర్



ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు

పట్టణంలోని సైదాబాద్ షాదిఖానాలో శనివారం మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ తెలిపారు. 850 మంది ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారని అందులో 652 దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు హాజరఅయ్యారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చౌహన్, వార్డు కౌన్సిలర్,, జూనియర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ రైతు వేదికలో ఎంపీపీ రజిని కిషోర్, రెంజల్ సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దీన్ జీలుగ విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. ప్రభుత్వం 65శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలను అందజేశారు. రైతులు పట్టా పాస్ పుస్తకాలతో వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద టోకెన్లు తీసుకొని జీలుగ విత్తనాలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ జిల్లా నాయకులు ఎండి మౌలానా, డైరెక్టర్లు ఖదీర్ భాష ,సాయిలు, పుట్టి సాయి రెడ్డి, సమీ, సీఈవో రాము, గ్రామ కమిటీ అధ్యక్షులు అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



ఆర్మూర్ నాలుగోవార్డులో..

నవతెలంగాణ-ఆర్మూర్/వేల్పూర్

పట్టణంలోని రెండోవార్డు, ఆలూరు మండల కేంద్రం, మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలోని శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కాందేశ్ సంగీత సుర్బిరియాల సర్పంచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పెర్కిట్ నాలుగవ వార్డులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ నచ్చు చిన్నారెడ్డి, 4వ వార్డు అధ్యక్షులు కామని నరేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సొన్న నర్సింలు, రైతు విభాగం అధ్యక్షులు పెద్దకాపు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నల్లవెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు..

వేల్పూర్: కొత్తపల్లి గ్రామాలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులు నలిమెల భాజన్నకు రూ.45 వేలు, కమ్మరి ఉత్తేజ్‌కు రూ.18 వేలు అందించారు. ఆపద కాలంలో చేయూత ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు మంత్రి ప్రశాంత్ రెడ్డికి హదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నితీష్ కుమార్, ఉప సర్పంచ్ లింబాద్రిగౌడ్, సొసైటీ డైరెక్టర్ రామన్న పాల్గొన్నారు.



వేల్పూర్: చెక్కు అందజేస్తున్న నాయకులు

విద్యార్థులకు అబినందన

నవతెలంగాణ-భీంగల్

చీఫ్ మినిస్టర్ కప్‌లో ప్రతిభ చాటి కప్ సాధించిన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులను డాక్టర్ బసంత్‌రెడ్డి అబినందించారు. ఖోఖోలో బాలికలు ప్రథమ, వాలీబాల్‌లో బాలురు ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరు జిల్లా స్థాయికి ఎంపికవ్వడంతో శనివారం డాక్టర్ బసంత్‌రెడ్డి విద్యార్థులను అబినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ నెల 22 నుంచి జరిగే జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలని సూచించారు. కార్యమంలో పిడి గోపిరెడ్డి, పీఈటీలు అబిలాష్,అక్‌పతి తదితరులు పాల్గొన్నారు.

టీయూలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి :పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న ఎస్‌కే అషర్

తెలంగాణ యూనివర్సిటీ (టియు) లో కొన్ని నెలలుగా జరుగుతున్న వివాదాలకు ఫుల్ స్టాప్ పడేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) నగర కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్‌నగరంలోని ఎన్ఆర్ భవన్, కోటగల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నగర అధ్యక్షులు ఎస్కే అషర్ మాట్లాడుతూ... తెలంగాణ యూనివర్సిటీలో గత కొన్ని నెలల నుండి జరుగుతున్న వివాదాల కారణంగా పరిపాలన స్తంభించి, అభివద్ధి కుంటుపడిందని అన్నారు. రిజిస్ట్రార్ పోస్టు కేంద్రంగా వివాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వీసీ, ఈసీ, నవీన్ మిట్టల్ యూనివర్సిటీ విద్యార్థుల ప్రయోజనాలను గాలికొదిలేసి, తమ మాటే నెగ్గాలని ఎవరికి వారు ప్రయత్నిస్తుండడం వివాదాలకు కారణమని అన్నారు. ఎవరికి అనుకూలమైన వ్యక్తిని వారు రిజిస్ట్రార్‌గా పెట్టుకుని యూనివర్సిటీపై ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అంతర్గత పోరులో యూనివర్సిటీ ప్రతిష్ఠ మరింత దిగజారిందని అన్నారు. యూనివర్సిటీ, వివాదాలకు నిలయంగా, పైరవికారులకు అడ్డాగా మారిందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరైనది కాదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీలో జరుగుతున్న వివాదాలకు చెక్ పెట్టాలన్నారు. 2017 నుండి టీయూలో జరిగిన నియమాకాలు, పదోన్నతులపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ నియామకాలు, పదోన్నతులను రద్దు చేయాలన్నారు. యూనివర్సిటీలో అకడమిక్ వాతావరణాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు మహిపాల్, నగర నాయకులు గమ్య, శివ పాల్గొన్నారు.

22న జగదాంబ సేవాలాల్ రెండో వార్షికోత్సవం

నవతెలంగాణ-ఏర్గట్ల

బట్టాపూర్ లో జగదాంబ సేవాలాల్ ఆలయ రెండవ వార్షికోత్సవాన్ని ఈ నెల 22 సోమవారం నిర్వహించనున్నట్లు తండా అధ్యక్షులు మూడ్ గంగారాం తెలిపారు. పూజ కార్యక్రమాలు అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధి పనులు పరిశీలన

నవతెలంగాణ-కోటగిరి

ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి తెలిపారు. శనివారం రాంపూర్ గ్రామంలోని ఉపాధి పనులను ఎంపీడీవో పరిశీలించారు. వేసవి దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీల పట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు కనీస అవసరాలు తీర్చాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లు దగ్గర ఉంచుకోవాలని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల

బకాయి వేతనాలు బిల్లులు చెల్లించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మధ్యాహ్న భోజన కార్మికుల బకాయి వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో సాయమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఓమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తామని హాజరు శాతం పెంచుతామని మాటల్లో చెబుతున్న వాటికి తోడ్పాటును అందిస్తున్న విద్యార్థులను మంచి రుచికరమైన భోజనం పెట్టిన కార్మికులకు మాత్రం ప్రభుత్వం కడుపు నింపటం లేదన్నారు. ధరలకు అనుగుణంగా కార్మికుల రేట్లు పెంచడం లేదని, కోడిగుడ్లు, సిలిండర్ నిత్యావసర వస్తువుల భారం కార్మికులపై పడుతుందని, అప్పులు చేసి కార్మికులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వారికి రావలసిన బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం సరికాదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా కార్మికులకు 3000 రూపాయల వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి ఆరు నెలలవుతున్న నేటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని అన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి చక్రపాణి మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చే గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే ఇవ్వాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా వంట సామాగ్రి ధరలను పెంచాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు పిఎఫ్, ఈఎస్ఐ, పని భద్రత కల్పించాలని, ప్రతినెల మొదటి వారంలో బిల్లులు వేతనాలు చెల్లించాలని, తదితర డిమాండ్లతో నిర్వహించిఏ కార్యక్రమాల్లో కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి నర్సింగరావు తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు పెద్దమ్మి, నాగలక్ష్మి, గంగామణి , సుధాకర్ సాయమ్మ 34 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరుగురికి దళితరత్న అవార్డులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ కోటగిరి



నిజామాబాద్‌సిటీ: దళితరత్న అవార్డు అందుకున్న జిల్లావాసులు

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 132 జయంతి ఉత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వము దళితులకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డులను ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆరుగురు దళిత నాయకులకు అందించారు. మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజ్, జిల్లా అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లయ్య, మిర్జాపూర్ సాయిలు, రవీంద్రబాబు, బత్తుల కిష్టయ్య, బట్టి గంగాధర్, సమ్మయ్యకు ఎస్సీ, గిరిజన, బిసీ, మైనారిటీ, వికలాంగుల, వయోజనుల సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా శనివారం దళిత రత్న అవార్డు లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబెద్కర్ ఆశయ సాధన కోసం, దళితుల సంక్షేమానికి ఎల్లావెళల దళితుల అభివద్ధికి పాటుపడుతున్నారని అవార్డులు ప్రదానం చేయడం సంతోష కరమని అన్నారు. మరింత ఉత్సాహంతో ఇంకా ఎన్నో సహకార కార్యక్రమాలు దళితులకు చేరే విధంగా ఎల్లావేళలా పాటుపడుతామని తెలిపారు.

కోటగిరి: మండలంలోని యాద్గార్ పూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ విజయ భర్త మాల మహానాడు మండలాధ్యక్షులు మిర్జాపూర్ సాయన్న దళిత రత్న అవార్డు అందుకున్నారు. శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో అవార్డు అందుకున్నారు. బహుజనల అభివద్ధికి నిరంతరం పాటుపడుతూ సామాజికంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో దళిత రత్న అవార్డు వచ్చినట్లు మిర్జాపూర్ సాయన్న తెలిపారు మండల నాయకులు అభినందనలు తెలిపారు.



కోటగిరి: అవార్డు అందుకుంటున్న సాయన్న

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-కోటగిరి

పొతంగల్ మండలంలోని హంగర్గ ఫారంలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నెషనల్ నిజామాబాద్ స్ఫూర్తి కోశాధికారి మల్లెపూల విట్టలేశ్వర్ శనివారం పారిశుద్ధ్య కార్మికులకు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా విట్టలేశ్వర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలోని చెత్తను సేకరించి, మురికి కాలువలను శుభ్రపరిచి దోమలు వ్యాప్తి చెందకుండా చేస్తారని, గ్రామాన్ని అందంగా ఉంచుతూ మనకు ఎటువంటి రోగాలు ప్రబలకుండా చేసేవారే పారిశుద్ధ్య కార్మికులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మహేష్, కార్యదర్శి వజ్ర మహేందర్, సర్పంచ్ ఎజాజ్ ఖాన్, సెక్రెటరీ నిర్మల, వార్డు మెంబెర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు గాంధారి విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని గాంధారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లోండియా రాజు నాయక్, కస్తూరి సృజన, చిల్లెల సాయిరాజు ముగ్గురు ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌నకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఆర్ వెంకటేశ్వర్ గౌడ్ శనివారం తెలిపారు. ముగ్గురు విద్యార్థులకు నాలుగు సంవత్సరాలకు సంవత్సరానికి 12 వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్ రానున్నట్టు తెలిపారు. వారి ఉన్నత చదువులకు తోడ్పాటు అందినట్టు తెలిపారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికవ్వడం పట్ల విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఎస్ఎంసి చైర్మన్ కమ్మరి స్వామి ,ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు తెలియజేశారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూర్ మండలంలోని దామరాంచ గ్రామంలో ప్రభుత్వ సబ్సిడీపై జీలుగా, పచ్చి రొట్టె విత్తనాలను సొసైటీ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి రైతులకు అందజేశారు. శనివారం దామరాంచ గ్రామంలోని సహకార సంఘం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పచ్చి రొట్ట ఎరువులు అయిన జీలుగు విత్తనాలు దామరంచ సహకార సంఘం నందు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. 30 కిలోల జీలుగా బస్తా రాయితీ పోను రైతు చెల్లించవలసిన ధర రూ.843 ఉన్నట్టు తెలిపారు. ఒక బస్తా 2 1/2 (రెండున్నర) ఎకరాలకు సరిపోతుందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ రైతులు విత్తనాలు పొందాలంటే తప్పనిసరిగా పట్టా పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నెంబర్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ యంపిపి కాశీరాం, గ్రామ సర్పంచ్ విఠల్, రైతు బంధు సమితి గ్రామ అధ్యక్షులు నబీ, ఏఈఓ అనూష, ప్రాథమిక సహకార సంఘం సీఈఓ అబ్బాస్, సొసైటీ డైరెక్టర్లు, తదితరులు హాజరయ్యారు.

ఓటర్ఐడీలో అడ్రస్ మార్చుకోవచ్చు

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ఫామ్ -8 నింపి మీ డోర్ నెంబర్ అప్డేట్ చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఓటర్ల జాబితాల తప్పుల సవరణపై రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ జాబితాలో మీ ఇంటి నెంబర్లు తప్పుగా ఉంటే గుర్తించి ఫామ్ -8 నింపి అప్డేట్ తో మీ గుర్తింపు పదిలం చేసుకోవచ్చని తెలిపారు. మల్టిపుల్ పోర్షన్స్ ఉన్న ఇల్లు లేదా అపార్ట్మెంట్లలో ఒక ఇంటి నెంబర్ పై వేరువేరు కుటుంబాలు ఓటర్లుగా నమోదు అయితే ప్రతి ఫ్లాట్, పోర్షన్ లలో ఉంటున్న కుటుంబానికి ఒక ఇంటి నెంబర్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ఇంటి నెంబర్, సరియైన చిరునామా అప్డేట్ చేయడంలో బిఎల్ఓలు మీకు సహకారం అందిస్తారని పేర్కొన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ మొబైల్ యాప్ ద్వారా కొత్తగా ఓటర్ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. యువతి, యువకులు వారి ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ చేసుకోవచ్చని చెప్పారు. 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సాయి భుజంగరావు, అధికారులు నవీన్ కుమార్, నరేందర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన చెస్ క్రీడాకారుడు ప్రణీత్



ప్రణీత్‌ను అభినందిస్తున్న స్పీకర్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ పట్టణంలోని స్పీకర్ నివాసంలో శనివారం సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డిని అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు నల్గొండ జిల్లాకు చెందన ఉప్పల ప్రణీత్ మర్యాద పూర్వకంగా కలిశాడు.. ఈ సందర్భంగా స్పీకర్ ఉప్పల ప్రణీత్ ను అభినందించి భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కపూర్ క్రీడలను ఏర్పాటు చేసిందని అందరూ పాల్గొని వారి ప్రతిభను కనబరిచారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్రస్థాయికి ఆటలాడే అవకాశం సీఎం అవకాశం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, ప్రణీత్ తండ్రి ఉప్పల శ్రీనివాస్, రైతు నగర్ సర్పంచ్ నాగేశ్వరరావు, తిమ్మాపూర్ సర్పంచ్ రాంబాబు తదతరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/రమారెడ్డి

ఎమ్మెల్యే జాజల సురేందర్ సూచన మేరకు బాధితులకు శనివారం సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసినట్టు నాయకులు తెలిపారు. నాగిరెడ్డిపెట్ మండల చీనూర్ గ్రామానికి చెందిన నాసన్‌పల్లి కిషన్ తండ్రి పర్వయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా అతనికి మెరుగైన చికిత్స కొరకు కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ని సంప్రదించగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలోని సంబంధిత డాక్టర్లతో మాట్లాడి చేర్పించారు. కిషన్ శస్త్ర చికిత్స కొరకు రూ. 2,50,000/- సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి చెక్కుని మంజూరు చేయించారు. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామారెడ్డి మండల ఉప్పల్వాయి గ్రామానికి చెందిన సురంపల్లీ నర్సింలుకి రూ.2,50,000 రూపాయల సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓ సి చెక్కును, ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన మామిండ్ల సత్తవ్వ లింగయ్యకు శస్త్ర చికిత్స నిమిత్తం రూ.2,00,000 రూపాయల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి చెక్కులను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపెట్ మండల బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సిద్ధయ్య, బిఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ నాయక్, గౌరవ ఎమ్మెల్యే గారి పి.ఎ మహ్మద్ ఆరిఫ్,యాదగిరి, కిషన్, వెంకట్, అశోక్ ఉన్నారు.

గుండెపోటుతో యువకుడు హఠాన్మరణం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



లక్ష్మణ్(ఫైల్)

మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన చాకలి లక్ష్మణ్ (27) గుండెపోటుతో శనివారం మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. తెల్లవారుజామున చాతిలో నొప్పిగా ఉందని చెప్పగా ఎల్లారెడ్డి ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యమంలో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మణ్ వృత్తి వ్యవసాయ కూలి పని చేస్తుండేవాడు. బాధిత కుటుంబానిది రెక్కాడితే తప్ప డొక్కాడని దుస్థితి అని, దాతలు, ప్రభుత్వం కుటుంబీకులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగ వస్తువుల సేకరణకు స్పందన

- **మున్సిపల్ చైర్మన్ గంగాధర్**

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

ఇళ్లల్లోని పనికిరాని వస్తువుల సేకరణ కోసం మున్సిపాలిటీ వారు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌కు నగరవాసుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ గంగాధర్ తెలిపారు. శనివారం బాన్సువాడ పట్టణంలో త్రిబుల్ ఆర్ (రెడ్యూస్, రియూజ్, రీసైకిల్) సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గంగాధర్ మాట్లాడుతూ ఇండ్లలో పాత వస్తువులు, పుస్తకాలు, చెప్పులు, ఆట బొమ్మలు, దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులు, నిరూప యోగంగా ఉండే వస్తువులను మున్సిపల్ వారు ఏర్పాటు చేసిన సెంటర్ లో అందజేయాలని సూచించారు. నేటి నుండి వచ్చే నెల 5 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తమ ఇళ్లలో ఉన్న నిరుపయోగ వస్తువులను ఎక్కడ వేయాలో తెలియక, ఇంట్లో ఉంచుకోలేక ఇబ్బందులు పడుతున్న నగరవాసులు ఈ సదుపాయాన్ని ఎంతో మేలు చేకూరుతుందన్నారు.



ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఇంటికే వచ్చి ఆయా వస్తువులను బల్దియా సేకరిస్తుండడంతో ఎన్నో ఏళ్ల నుండి తమ ఇళ్లలో ఉన్న నిరుపయోగ వస్తువులను పెద్ద ఎత్తున అందజేస్తున్నారని అన్నారు. వచ్చే 5వ తేదీ వరకు జరిగే ఈ డ్రైవ్‌లో ఇళ్లలో వృథాగా ఉన్న పాత వస్తువులు, కూలర్లు, పరుపులు, మెత్తలు, పనిచేయని ఎలక్ట్రానిక్ వస్తువులు, విరిగిన కుర్చీలతో పాటు పనికిరాని ఏ వస్తువునైనా ఇచ్చేయవచ్చున్నారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య వారోత్సవాలు



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో పారిశుద్ధ్య వారోత్సవాలు మున్సిపల్ కమిషనర్ జీవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జీవన్ మాట్లాడుతూ పారిశుద్ధ్య వారోత్సవాలో భాగంగా ఆర్ ఆర్ ఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు వార్డుల్లో పొడి చెత్తను సేకరించారు. మెరా లైఫ్ మేరా స్వచ్ షెహర్‌లో భాగంగా మున్సిపాలిటీ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఫీజు దోపిడీ అరికట్టాలి



మాట్లాడుతున్న నాయకులు

- **విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ**

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా విద్య పేరుతో అడ్డ అదుపూ లేకుండా ఇష్టానుసారంగా ప్రైవేట్ విద్యాసంఘాలు తోక పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులు నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం కామారెడ్డి పట్టణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తిరుపతయ్య కమిటీ సిఫారసులను తుంగలో తొక్కుతూ సంవత్సరానికి కనీసం విద్యాసంస్థలు 5 శాతం లాభాలు గడించాలని ఉన్నా వాటిని జిల్లా విద్యా అధికారులు సైతం పట్టించుకోకపోవడం విడ్డూరం అని అన్నారు. అదే విధంగా విద్య సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణం లో అన్ని విద్యాసంస్థలు తిరుపతయ్య కమిటీ ఇచ్చిన సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒలంపియాడ్ బైజూస్, డీజీ, షహీన్‌లాంటి తోక పేర్లతో ఉన్నటువంటి పాఠశాలలు శ్రీ చైతన్య నారాయణ కార్పొరేట్ కళాశాలను మోసపోవద్దని విద్యార్థులకు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సభావత్ వినోద్ నాయక్ మరియు ఉమ్మడి జిల్లా ఇన్చార్జి నేనావత్ జేత్రామ్ రాథోడ్, సభావాత్ సంతోష్ నాయక్, జిల్లా నాయకులు తదితర పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

నవతెలంగాణ-ముప్కాల్

శనివారం రోజు ఉదయం వేకువజామున ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన గాండ్ల శోభ (52) చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన లక్ష్మీబాయి వేకువజామున గ్రామ శివారులోని చెరువు గట్టు వద్దకు వెళ్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడడం జరిగిందని ఎస్ఐ భాస్కరా చారి తెలిపారు. ఆమె మృతికి కారణాలు తెలియరాలేవని, మృతిరాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

25న జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

- **పోస్టర్ల ఆవిష్కరణ**

నవతెలంగాణ-మద్నూర్/పెద్దకొడప్‌గల్

ఈనెల 25న బిచ్కుంద మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని మద్నూర్ మండల ప్రజా ప్రతినిధులు సూచించారు. జాబ్ మేళ పోస్టర్లను శనివారం మద్నూర్ మండల కేంద్రంలో అలాగే పెద్ద ఎక్లారా గ్రామాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేష్, మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకుల కోసం వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ పరంగా మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగాల కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు బి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బన్సి పటేల్ తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో పోస్టర్‌లు ఆవిష్కరణ



పెద్దకొడప్‌గల్‌లో..

నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

పెద్దకొడప్‌గల్:

మండలం వడ్లం గ్రామంలో ఎమ్మెల్యే చేపట్టిన నిరుద్యోగ జాబ్ మేళా గోడపత్రికలను ఎంపీపీ ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే హనుమాన్ షిండే దాదాపు 50 కంపెనీలతో ఒప్పందం చేసుకొని రెండు వేల మంది నిరుద్యోగ యువకులకు ఉపాధి కలిగే విధంగా కృషి చేస్తున్నందుకు ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి మరికొన్ని ఉద్యోగాలు తెచ్చే విధంగా కృషి చేస్తారని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 25వ తేదీన బిచ్కుంద మార్కెట్ కమిటీ లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు యువకులు విచ్చేసి వారికి నచ్చిన కంపెనీలలో ఉద్యోగాలు పొందాలని ఆయన యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ ప్రెసిడెంట్ సంజీవ్, ఉపాధ్యక్షులు సాయిలు, సెక్రెటరీ హట్కరి రాము, బిఆర్ఎస్ నాయకులు మల్గొండ, గులాబ్ రావు , నందు, వడ్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మదన్‌మోహన్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్ రావు పలువురిని పరామర్శించి, బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసి, కాంగ్రెస్ జోడోయాత్రను నిర్వహించారు. రామారెడ్డి గ్రామానికి చెందిన నామాల గంగాధర్ తల్లి మృతిచెందగా, చాత్రబోయిన పెద్దోళ్ల లక్ష్మి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి, మదన్ మోహన్ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇసన్నపల్లిలో ఉమ్మెత్తల లక్ష్మారెడ్డి గుడిసె దగ్ధం అవటంతో ఘటన స్థలాన్ని పరిశీలించి, కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రంగంపేటలో కాంగ్రెస్ జూడో యాత్రను, గడపగడపకు తిరుగుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే సంక్షేమం పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, కాంగ్రెస్ నాయకులు తూర్పు రాజు, రాజు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌స్పాట్ వాల్యుయేషన్ పేమెంట్ డబ్బులు చెల్లించాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/ఆర్మూర్

ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ పేమెంట్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 21 నాటికే స్పాట్ వాల్యుయేషన్ ముగిసినప్పటికీ ఇప్పటి వరకు పేమెంట్ ఇవ్వకపోవడం సరికాదని ఆయన అన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఇంటర్మీడియట్ లెక్చరర్‌లకు వేసవిలో వేతనాలు లేక అవస్థలు పడుతున్న విషయం ఈ ప్రభుత్వానికి తెల్వదా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో వేలాదిమంది ప్రైవేట్ లెక్చరర్స్ పనిచేస్తున్నారని, అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో నెట్టుకొస్తున్నారని ఆయన వివరించారు. ఒక దిక్కు ప్రభుత్వం కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న లెక్చరర్లను క్రమబద్ధీకరణ చేయడంలో చిత్తశుద్ధి లేదని ఆయన అన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ లెక్చరర్స్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని అన్నారు. చదువుకున్న విద్యావంతుల పట్ల ఇలా వ్యవహరించడం తగదని అన్నారు. ఇప్పటికైనా వెంటనే నిర్లక్ష్యం విడనాడి, పేమెంట్ డబ్బులను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఫైల్‌ఫొటో

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బాల్కొండ

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్, బస్సాపూర్ గ్రామ శివారులో రెండు గ్రామాల కోసం నూతన సబ్ స్టేషన్ నిర్మించేందుకు స్థలాన్ని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్సీ గంగాధర్ శనివారం పరిశీలించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. వరద కాలువ పక్కన ఉన్న స్థలాన్ని సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ మానేటి తులసి నాగభూషణం, ఎంపీటీసీ సభ్యులు అనుగుల రాంరాజ్ గౌడ్, ఉపసర్పంచి జాపు మల్లేష్, విద్యుత్తు శాఖ ఏడి రాజేశ్వర్, ఏఈ శ్రీనివాస్, నాయకులు జాపు పెద్ద భూమన్న, తోట వంశీ, కొండ అశోక్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు

- **ఎంపికైన వారు పాల్గొనాలి : జిల్లా యువజన, క్రీడల అధికారి ముత్తెన్న**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సీఎం కప్ పోటీల్లో మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పాల్గొనాలని జిల్లా యువజన, క్రీడల అధికారి జె.ముత్తన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో సిఎం కప్-2023 ను ఈ నెల 15 నుండి 31వరకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి లో వివిధ క్రీడంశాలలో పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనని, ఇప్పటికే మండల స్థాయిలో పోటీలు ముగిసినట్టు తెలిపారు.

ఇందులో బాగంగా మండల స్థాయిలో క్రీడా పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుండి 24 వరకు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాలని అన్నారు. మండల స్థాయిలో ఎంపికైన జట్లును సంబంధిత మండల అధికారులు ఈనెల 22 ఉదయం 8 గంటల లోపు పోలీస్ పరేడ్ గ్రౌండ్, నిజామాబాద్ నందు జరుగు జిల్లా స్థాయి పోటీల ప్రారంబోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

సబ్‌సెంటర్ స్థలం కోసం సర్పంచ్‌కు వినతి

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని యంచ గ్రామంలో సబ్ సెంటర్ నిర్మాణం కోసం డిఎంహెచ్వో సుదర్శన్ ఆధ్వర్యంలో సర్పంచ్ కొట్టాల లహరి ప్రవీణ్ కుమార్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో సుదర్శన్ మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం జన ఆరోగ్య సమితి సమావేశాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని అందులో భాగంగా యంచ గ్రామంలో సబ్ సెంటర్ నిర్మించేందుకు 400 గజాల స్థలం గ్రామపంచాయతీ తీర్మానం చేయించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగురావు, వైద్య సిబ్బంది మరియు పాలకవర్గం పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేత

డీఈఈసెట్‌కు 24 వరకు దరఖాస్తు స్వీకరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

డీఈఎల్, డీపీఎస్ఈ కోర్సు అడ్మిషన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని డైట్ ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఈసెట్ - 2023 కొరకు అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోనుటకు అవకాశం ఉందని అన్నారు. ఈ కోర్సు 2023-2025 బ్యాచ్ డీఈఎల్, డీపీఎస్ఈ కోర్సు కు ఆన్ లైన్ లో జూన్ 01 ఉంటుందని అన్నారు.

మొక్కలకు నీరందించాలి : ఎంపీడీవో

నవతెలంగాణ-ధర్పల్లి

ఎండలను దృష్టిలో పెట్టుకొని నర్సరీల్లోని మొక్కలకు నీటిని అందించడంలో అశ్రద్ధ వహించరాదని ఎంపిడిఓ లక్ష్మణ్ సూచించారు. శనివారం మండలంలోని రామడుగు, గోవింద్ పల్లి గ్రామాల్లోని నర్సరీలను సందర్శించారు. నర్సరీల్లోని మొక్కల వివరాలను తెలుసుకున్నారు. ఎనర్సరీలో ఎలాంటి మొక్కలు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని ఎన్ఆర్ఈజీఎస్ పనుల వద్దకు వెళ్లి పరిశీలించారు. కూలీలతో వారి పనులు ,హాజరు పట్టికను పరిశీలించారు. ఎండలకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్యకు దళిత రత్న అవార్డు

నవతెలంగాణ- బోధన్



బోధన్ మండలం ఊట్పల్లి గ్రామానికి చెందిన న్యాయవాది బోధన్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పల్నాటి సమయ్యకు శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్ హైదరాబాదులో దళిత రత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ దళిత రత్న అవార్డు రావడం ఎంతో గర్వకారణంగా ఉందని, సమాజ సేవ చేయడానికి తనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు.

వైద్యునికి సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి



మండలంలో కంటి వెలుగు రెండో విడత పథకంలో మొదటి రోజు నుండి నిన్నటి వరకు వైద్యం అందిస్తూ కంటి వెలుగు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన పరిచారు. మోస్రా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి, ఎడపల్లి మండల కంటి వెలుగు ఇన్చార్జ్ వైద్యాధికారి రాజ్ కుమార్ తన వంతు సేవలు అందించడంతో జానకంపేట సర్పంచ్ సాయిలు, ఎంపీటీసీ, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మంద సంజవ్ కుమార్ వైద్యాధికారి రాజ్ కుమార్ ను శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు.

పారిశుధ్య వారోత్సవాలను సక్రమంగా నిర్వహించాలి

- జిల్లా పంచాయతీ అధికారి జయసుధ
- పారిశుధ్య పనులు పరిశీలన

నవతెలంగాణ - బోధన్/కమ్మర్‌పల్లి

ప్రభుత్వం చేపట్టిన పారిశుధ్య వారోత్సవాలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ అన్నారు. శనివారం బోధన్ మండలం ఊట్ పల్లి, బెల్లాల్, మినార్ పల్లి గ్రామాలలో సీఆర్డీ రాష్ట్ర కార్యాలయ డిప్యూటీ ఈఈ నాగభూషణంతో ఆమె పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు కాలనీలను సందర్శించి పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే పల్లె ప్రగతి కార్యక్రమంలో చేపట్టిన పనులను పరిశీలించారు. పనులు సక్రమంగా నిర్వహించడంతో ఆమే సంతృప్తి వ్యక్తం చేశారు.వారి వెంట ఎంపీడీఓ పర్భన్న, ఎంపీఓ మధుకర్ ,గ్రామ సర్పంచ్ మూడ్ హీరబాయి, కృష్ణగుప్త, రాజు, సొసైటీ సీఈఓ హనుమండ్లు, ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు. హాజరు అయ్యారు.



బోధన్ :నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ గ్రామంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను జిల్లా లేబర్, మండల ప్రత్యేక అధికారి యోహాన్ సందర్శించి పరిశీలించారు. గ్రామంలోని అవెన్యూ ప్లాంటేషన్‌లో పిచ్చి మొక్కలను తొలగించి, మురికి కాలువలను శుభ్రం చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సూచించారు. చెత్తను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తబుట్ట లోనే వేసి, గ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు వేయాలన్నారు. చెత్తాచెదారాన్ని మురికి కాలువలో వేయొద్దని, మురికి నీరు నిల్వ ఉంటే దోమల వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాలకు గురవుతారని అన్నారు. ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బందితో మురికి కాలువలు శుభ్రం చేయించాలని సర్పంచ్‌కు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ సక్కరం అశోక్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ బిఆర్ఎస్ నాయకులు బైకాని మహేష్, ఆర్. పి. రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని ఊట్ పల్లి గ్రామానికి చెందిన నలుగురు గిరిజన కూలీలు గత కొన్ని రోజుల క్రితం నిజామాబాద్ బైపాస్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో బాధిత కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం ఆయా కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్సీ కవిత తరఫున ఆమె వ్యక్తిగత సహాయకుడు నవీన్, బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హనుమాండ్లు లక్షా40వేల రూపాయలను అందించారు. గాయపడిన ముగ్గురికి 45వేల రూపాయలను అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గిర్ధవర్ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బుద్దె రాజేశ్వరరావు, సాలురా మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సయ్య, ప్రధానకార్యదర్శి సిర్ప సుదర్శన్, మండల యువజన అధ్యక్షుడు గణేష్, ఎఎంసి డైరెక్టర్ వినోద్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

గుండెపోటుతో వెటర్నరీ అసిస్టెంట్ సమియోద్దిన్ మృతి

నవతెలంగాణ-ఎడపల్లి



మండల కేంద్రంలోగల పశు వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సమియోధిన్ (సమ్మీ) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులతో బోధన్‌లో ఉంటున్నారు. సుమారు 15 సంవత్సరాల కాలం నుండి ఆయన పాడి రైతులు, మూగజీవాలు కలిగి ఉన్న ప్రజలు కానీ అత్యవసర పరిస్థితుల్లో సమ్మీకి సమాచారం అందిస్తే హుటాహుటిన గ్రామానికి చేరుకొని మూగజీవాల ప్రాణాలను కాపాడినట్లు మంగళ్ పహాడ్, ఎడపల్లి, కుర్నాపల్లి, చుట్టుపక్కల గ్రామాల పాడి రైతులు ,గ్రామస్తులు తెలిపారు. మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాడి రైతులు, స్నేహితులు, సమ్మీ మృతి చెందడం బాధాకర విషయమన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించాలి

- ఆర్డీఓ రాజేశ్వర్



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీవో

నవతెలంగాణ-బోధన్

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగి భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించాలని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లిలోని ఇందూర్ హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. ఇందూర్ హైస్కూల్ విద్యార్థులు చదువుతో పాటు ప్రతి అంశంలోనూ మెరికల్ లాంటి విద్యార్థులుగా ఉంటారని అన్నారు. చదువుతోపాటు ఎన్నో అంశాలలో ఈ పాఠశాలలో బోధన కొనసాగుతుందని, దాంతో విద్యార్థులు అన్ని రంగాలలో నిష్ణాతులుగా తయారవుతున్నారని, దానికి నిదర్శనమే పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ జీపీఏ మార్కులు సాధించారని అన్నారు. అనంతరం ఆయన 10కి10 జీపీఏ సాధించిన విద్యార్థులు దివ్యశ్రీ, రిష్వత , 9.8 జీపీఏ సాధించిన ప్రవీణ్ కుమార్, నందిని , సృజన్ రెడ్డి, కావేరి , నేహ, అవంతిక, రోష్మి, సాయిచరణ్ రెడ్డి, అరబింద్, సుమిత్, సాహితలను ఘన సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కొడాలి కిషోర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కిసాన్ తాండ గ్రామంలో ఎంపీపీ రజిని కిషోర్, జడ్పిటిసి మేక విజయ సంతోష్ సిసి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. రెండు లక్షల రూపాయల జిల్లా పరిషత్ నిధులు మంజూరు కాగా ఆ నిధులతో పనులను ప్రారంభించినట్లు సర్పంచ్ మలావతి జమున విజయ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో దళితరత్న రోడ్ల లింగం ఉప సర్పంచ్ పిర్ సింగ్, పూల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర గ్రామంగా లక్ష్మాపూర్ ఎంపిక



సన్మానిస్తున్న ప్రజాప్రతినిధి, అధికారులు

నవతెలంగాణ-చందూర్ (వర్ని)

మండలం లోని లక్ష్మాపూర్ గ్రామానికి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో బాగంగా హైదరాబాద్ స్పెషల్ ఆఫీసర్ నాగభూషణం, నరేష్, రాజు అధికారులు శనివారం గ్రామాన్ని పరిశీలించారు గ్రామంలో పరిశుభ్రత 100శాతం ఉండటంతో సర్పంచ్ బొడ్డోల్ల సత్యనారాయణను అభినందించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వారు తెలిపారు. గ్రామ పంచాయతీ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌కు సెలెక్ట్ అవ్వడం పంచాయతీ కార్మికుల కృషి అని సర్పంచ్ పేర్కొన్నారు. పంచాయతీ ప్రత్యేక అధికారులు, సర్పంచ్ బొడ్డోల్ల సత్యనారాయణ, ఎంపీఈవో నీలావతి వారిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ తారాచంద్, ఏఈవో సౌజన్య, పంచాయతీ కార్యదర్శి నరేందర్, ఏపీవో సురేష్, టీఏ దేవి సింగ్, ఆపరేటర్ రియాజ్, జూనియర్ అసిస్టెంట్ రవిందర్ పాల్గొన్నారు.

స్నేహభావమే, ఐక్యతే గ్రామాభివృదికి తోడ్పడుతుంది

- డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ



మాట్లాడుతున్న సీఐ కృష్ణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్నేహభవం, ఐక్యతే భవిష్యత్తులో గ్రామాభివృద్ధికి తోడ్పడుతుందని, ఈ రోజుల్లో యువత ఫోన్లో నిమగ్నం అవుతున్నారని, అలాంటి సమయంలో ఘన్‌పూర్ యువత వినూత్నంగా అలోచించి 30 రోజులు గ్రామంలో ఉన్న 150 మంది యువకులను శారీరకంగా, మానసికంగా ఉత్తేజపరచడానికి క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వహించడం అభినందనీయమని డిచ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ అన్నారు. ఘనపూర్ ప్రీమియం లీగ్ విన్నర్, రన్నర్ టీమ్ లకు బహుమతి ప్రధానం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడెక్కడో చదువుకునే యువకులను విద్యార్థులను ఒక్క చోటుకి తెచ్చి వారి మధ్య స్నేహభావాన్ని పెంచడం, ఈ స్నేహభవమే, ఈ ఐక్యతే భవిష్యత్తులో గ్రామభివృదికి తోడ్పాటు అవుతుందని అన్నారు. యువత చెడు వ్యాసనాలకు గురి కావద్దని, గ్రామంలో ప్రతి ఒక్కరు చదువుకునేలా యువకులు కృషి చేయాలని అన్నారు. ఎస్ఐ కచ్చుకాయల గణేష్ మాట్లాడుతూ.. గ్రామంలో యువత పక్కదోవ పట్టకుండా జీపీఎల్ క్రికెట్ లీగులు పెట్టి చాలా మంచి పని చేశారన్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా యువకుల ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. విన్నర్ ఓం టీమ్‌కు రన్నర్ సాయినాథ్ టీమ్ కు మెమోంటోస్ అందజేశారు. కార్యక్రమం లో రామకృష్ణ, డైరెక్టర్ సతీష్ రెడ్డి మహేష్, ముత్యన్న, ఎన్నోళ సాగర్, రాంచందర్, నర్సయ్య, ఓం ప్రసాద్, దాస్, హరీష్, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారిని సవితకు గ్లోబల్ ఫేమ్ అవార్డు

- సీఐటీయూ, వ్యకాస నాయకుల హర్షం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల అంబం గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ పోచారం సవిత గ్లోబల్ ఫేమ్ అవార్డు రావడంపట్ల ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజానాట్య మండలి కళాకారిణిగా ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని అతి తక్కువ సమయంలో ఫోక్ సింగర్‌గా గుర్తించి మహమ్మద్ ఆర్ట్స్, గ్లోబల్ ఫెమ్ అవార్డ్‌ను అందించారు. యాంకర్ పప్పు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రముఖ సినీ పరిశ్రమకు చెందిన నటి, నటులు, బలగం సినిమా , సీరియల్ సినిమా యాక్టర్స్ చేతుల మీదుగా ఈ అవార్డులను ప్రదానం చేశారు. శాలువాలతో సన్మానించి మెమోంటోతో అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉదేశ్యం మారు ముళ్ల గ్రామాల్లో టాలెంట్ వుండి బయటకి రాలేని వారిని వెలితి తియ్యడమేనని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేస్తున్న యాంకర్ మహమ్మద్ పప్పు ని అభినందిస్తూ ఇంకెన్నో ఇలాంటి మంచి మంచి కార్యక్రమాలు చేయాలని ఫోక్ సింగర్ సవిత పోచారం అభినందించారు. పోచారం సవితకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, మల్యాల గోవర్ధన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్ రాములు అభినందించారు. ప్రజలను చైతన్య పరిచేలా పాటలు పాడాలని అన్నారు.



సవితను సన్మానిస్తున్న ప్రముఖులు

'యూనియన్ బలోపేతానికి కృషి చేస్తా'

నవతెలంగాణ-కంఠేశ్వర్

బిఆర్టియు మెప్మా ఆర్పీల రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దొండి స్వర్ణలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని టీఆర్ఎస్కెవి భవన్‌లో యూనియన్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రూప్ సింగ్, రాష్ట్ర అధ్యక్షురాలు మానుకోట సునీత, ప్రధాన కార్యదర్శి శ్రీమతి, కోశాధికారి జహేరా, యూనియన్ సభ్యులు రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన దొండి స్వర్ణలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అరుణోదయ రిసోర్స్ పర్సన్స్ జిల్లా అధ్యక్షురాలిగా కొనసాగుతున్న స్వర్ణలతకు, బిఆర్టియు మెప్మా ఆర్పీల ఉపాధ్యక్షులుగా నియమించడం పట్ల, రాష్ట్ర కమిటీకి ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని స్వర్ణలత వెల్లడించారు. స్వర్ణను పలువురు అరుణోదయ రిసోర్స్ పర్సన్స్ ఓబిల అధ్వర్యంలో ఆర్పీలు శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు స్వర్ణలత, కార్యదర్శి స్వర్ణలత, కోశాధికారి స్వప్న, ఉపాధ్యక్షురాలు మంజుల, సహాయ కార్యదర్శి జ్యోతి, ఆర్పీలు పాల్గొన్నారు.



స్వర్ణలతను సన్మానిస్తున్న ఆర్పీలు

ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి



చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-మెండోర

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపడుచులకు అండగా నిలుస్తుందని ఎంపిపి బురుకల.సుకన్య కమలాకర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కళ్యాణలక్ష్మి చెక్కులను అధికారులతో కలిసి ప్రజాప్రతినిధులు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ రెడ్డి , ఎంపిడిఓ శ్రీనివాస్ , డీసీసీబీ ఎంపీపీ బరుకల.సుకన్య కమలాకర్, డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్.శేఖర్ రెడ్డి , జెడ్పీటీసీ తలారి గంగాధర్, వైస్ ఎంపీపీ సరస్వతి రవి గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ నవీన్ గౌడ్, సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజరెడ్డి, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు సామ.గంగా రెడ్డి, సర్పంచ్ లు మిసోద్దిన్, మహేందర్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

- ఐకెపి వీవోఏలు
- వర్నిలో బతుకమ్మ ఆటతో నిరసన
- 27వ రోజుకు సమ్మె

నవతెలంగాణ-ఎడపల్లి/వర్ని/డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి పథం (ఐకెపి) ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 27వ రోజుకు చేరుకుంది. మహిళా సంఘాలు ఏర్పాటు చేయడంలో వీవోఏల పాత్ర ఎంతో కీలకమన్నారు. సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ సేవలను గుర్తించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్త్రీనిధి, బ్యాంకు రుణాలు కట్టించే బాధ్యత వివోలపై ప్రభుత్వం భారం మోపినా తమవంతు కృషి చేస్తూ మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నామని వారు గుర్తు చేశారు. కనసీ వేతనం నెలకు 20 వేల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేయాలని, శ్రీనిధి నుండి 50 వేల రూపాయల వ్యక్తిగత లోను సౌకర్యం ఇవ్వాలని, జీవో నెంబర్ 51ని సవరిస్తూ సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతోపాటు ఐడీ కార్డులను అందజేయాలన్నారు. సేఫ్ ద్వారా వీవోలకు వేతనాన్ని అకౌంట్లో వేసే విధంగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమ్మెలో శోభ, సుదర్శన్, పోచయ్య, యూసుఫ్ కొమరవ్వ, లత, కుమ్మరి, పుష్ప, జంగం సంధ్య మహేశ్వరి పాల్గొన్నారు.

వర్ని: మండలంలోని ఐకెపి వీవోఏలు బతుకమ్మ ఆటతో నిరసన తెలుపుతూ సమ్మె చేశారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను తక్షణమే అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పట్టించుకునే వరకు పోరాటం చేస్తామని సమ్మెను మాత్రం విరమించ బోమని తెలిపారు. సమ్మెలో చందూర్, వర్ని మండలాలకు చెందిన వివో ఏలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయించడంలో తాము అహర్నిశలు శ్రమిస్తామని ఇప్పటికైనా ముఖ్యమంత్రి కెసిఆర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కారానికి చొరవ చూపరా అని ఐకేపీ వీవోఏ ఇందల్ వాయి మండల అధ్యక్షురాలు కె సరళ, ప్రధాన కార్యదర్శి రాము అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ ఉద్యోగులకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాక పోవడంతో సమ్మె చేయక తప్పడం లేదన్నారు. అర్హులైన వారందరికీ సీసీలుగా నియమించాలని, యూనిఫామ్ కేటాయించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ. 10 లక్షల కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని వారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సువర్ణ, కోశాధికారి మమతా, సభ్యులు కవిత, సౌమ్య, అరుణ, స్వప్న, అలేఖ్య, రాధికా, లావణ్య, భాగ్య, మౌనిక పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ మండల సమైక్య ఆవరణంలో నిరవధికంగా చేస్తున్న వీవోఏల సమ్మెలో పాల్గొన్న వీవోఏలకు సెర్ప్ నుండి ఐడి కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వం నుండి కనీస వేతనం 18వేలు చెల్లించాలని, పదిలక్షల బీమా సౌకర్యం కల్పించాలని, వీవోఏలు మరొకసారి ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో సిరికొండ మండల వివోఏల అధ్యక్షుడు మూన్ సింగ్, కవిత, లలిత, లక్ష్మీ, సునీత, వర్ణ, పుష్ప, వినోద్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధులో గోసంగిలకు ప్రాధాన్యతనివ్వాలి

- గోసంగిసంఘం జిల్లా అధ్యక్షులు



జిల్లా ప్రధానకార్యదర్శి, కోశాధికారిని సన్మానిస్తున్న గోసంగి నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

గోసంగి సంఘం నిజామాబాద్ జిల్లా స్థాయి సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లా గోసంగి కులానికి చెందిన సుంకర్ పెల్లి సాయన్న ఎస్సి ఉప కులాల, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్య దర్శిగా, కోశాధికారిగా అంకమల్ల శంకర్ ఎన్నికై నందున గోసంగి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించినట్టు నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లెల సాయి చరణ్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... దళిత జాతి లో అత్యంత వెనకబడిన కులం గోసంగి కులం అని, గోసంగిలు విద్య, ఉద్యోగ, రాజకీయ పరంగా ఎదగాలని కోరారు. గోసంగి కులానికి చెందని వ్యక్తులు గోసంగి కుల సర్టిఫికెట్ తీసుకొని నిజమైన గోసంగిల హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. గోసంగిలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని, డీఎల్ఎస్సి కమిటీ వేసి అక్రమంగా తీసుకున్న సర్టిఫికెట్ లు రద్దు చేసే దాకా పోరాటం ఆగదని అన్నారు. దళిత బంధు పథకంలో గోసంగిలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి ధర్మపురి, గౌరవ అధ్యక్షుడు గంగ నర్సయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగన్న, కార్యదర్శులు, సలహాదారులు, రాఘవులు, బాలయ్య, రామస్వామి, బాలు, మోహన్, కిష్టయ్య ప్రవీణ్, నడిపి నర్సయ్య సత్యనారాయణ, లక్ష్మణ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

వస్తువులు కొనుగోలు చేస్తే బిల్లు తీసుకోవాలి

- వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మయవార్ రాజేశ్వర్
- అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా సుభాష్ నగర్ రైతు బజార్ ఆవరణలో నిజామాబాద్ లీగల్ మెట్రాలజీ జిల్లా ఇన్‌స్పెక్టర్ సుజాత అలీ అధ్యక్షతన సమావేశం శనివారం నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి టి. నాయక్ పాల్గొన్నారు. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మయవార్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. వినియోగదారులు తూనికల కొలతల్లో మోసాలు జరిగితే ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధర వసూలు చేసిన ఎక్స్పైరీ డేట్ వస్తువులు అమ్మిన పెట్రోల్ బంకుల్లో మోసాలు జరిగిన లేబుల్ లేని వస్తువులు అమ్మిన సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయాలని అన్నారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా వ్యాపారస్తుని వద్ద నుండి బిల్లులు అడిగి తీసుకోవాలని తెలిపారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాయక్ మాట్లాడుతూ.. కొన్ని షాపులను లీగల్ మెట్రాలజీ తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి శ్రీ లక్ష్మీ గణపతి కిరాణా మర్చంట్ రైతు బజార్ నైన్ టి రైతు బజార్ పికిల్స్ షాప్ అశోక హైపర్ మార్కెట్ పై మూడు కేసులు నమోదు చేశామని చెప్పారు. అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కానిస్టేబుల్ సురేందర్, వినియోగదారుల ప్రతినిధులు రమేష్, గంగాధర్, లీగల్ మెట్రాలజీ సిబ్బంది, ఫుడ్ సేఫ్టీ శ్రీనివాస్ ఫుడ్ సేఫ్టీ మొబైల్ వ్యాన్ దాని ప్రత్యేకత గురించి ఫుడ్ సేఫ్టీ అధికారి నాయక్ ప్రజలకు కల్తీ జరిగితే ఏ విధంగా మొబైల్ వ్యాన్ ఉపయోగపడుతుందని వినియోగదారులకు వివిరించారు. లీగల్ మెట్రాలజీ అధికారులు తూనికల కొలతలకు సంబంధించినటువంటి డెమోను ప్రజలకు అర్ధమయ్యే విధంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో వినియోగదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మయావార్ రాజేశ్వర్